ఆ భార్యాభర్త లిద్దరికీ కూడా తెలివి గొలిపింది. చిత్తుకాగితం ఎక్కడనుంచి ఎక్కడకు పోయిందీ తెలుపుదు చేసింది.

ఆ కాయితం ముక్క, బొమ్మ కత్తిరింపబడ్డ భాగం గ్రహణం మొట్టిలా ఆనవాలుగా అగపిస్తూవుంటే వీథంట ఎగిరి పోతూవుంది. ఆ ఎగిరిపోతూయున్న దాన్ని కరుబూజారావు వెనుదగిలి తీసికొనివచ్చి సూర్యరశ్మిలో చూచేడు.

29-4-1939 తేదీ గల డెయిలీ మిర్రర్‌యొక్క 18-వ పుటనుండి కత్తిరింపు అది. ఆ బొమ్మ డెబ్బైఆరేండ్ల కన్య! ఆమెయొక్క జీవితాన్ని గుదించిన వాక్యాలు అతి శ్రద్ధగా చదివినవారై బొమ్మను మళ్ళీ మళ్ళీ చూచినవారై కరుబూజా రావూ శశికాంతా యిద్దరూకూడా అన్యోన్యం యిలా చెప్పు కున్నారు మనకూ మనకూ తెలియని ఇంగ్లీషుభాషలో అతి రహస్యంగా కొసకు దేలిన ముక్కగా ఆ బొమ్మని గుఱించి— ఏమనీ?

'She wouldn't change her lot for any artificial delights the world could offer' అని.

.... .... .... .... ....

# నిన్నటిపువ్వు నిన్నటిదైనిక

నాడు మదరాసుకు మెయిల్లో
టిక్కట్టు దురుకుతుందా లేదా

అనే ఆందోళనతో రాజమహేంద్రం స్టేషన్‌కు వెళ్ళాను. టిక్కట్టు చులాగ్గానే దొరికింది. "బుక్కింగు ఆపేశాం" అని గాని "చిల్లరలే"దని గాని అనకుండా గూడిలోంచి యివలకు

వచ్చి వడింది టిక్కట్టు అడిగిన తడవుగా. మఱి మెయిల్ "లేటా" అని కనుక్కున్నాను. లేదు. రైట్టయిమే అంటూ పోనిచ్చాడు టిక్కట్ కలక్టర్ నా చేతిలోని టిక్కట్ "కటక్" మనిపిస్తూ. మఱక్కణ్ణుంచి ప్లాట్‌ఫారమ్మీదకురికి, వచ్చే గాడి వంక వంగి వంగి చూపులు సారిస్తూంటే నా లోపల అంకురించిన తలుపులకు మేరలేదు. రైలు కింద పడిపోయినాసరే "ఖాళీ పెట్టెలో ఎక్కి కూర్చోవాలని" కూలీక్కూడా అలాంటి సూచనే చేసి నావెనకాలే వుండమన్నాను; బెడింగు సూట్‌కేసు ఇత్యాదు లన్నీ నే కూర్చునేచోటనే ఉంచమన్నాను.

కూలివాడు, మెయిలింకా ఆగకుండానే, "ఈ బండి ఖాళీ బాబయ్యా! ఈ బండి బాగుంది. ఇందులో ఎక్కండి" అని హెచ్చరిస్తూనేవున్నాడు. కాని నేనేదో ముందుచూపుని అన్ని బళ్ళూ పరిశీలించి, ఒకానొక పెట్టెలోకి చొరబడి "సామాను ఇల్లా ఇవ్వు కిటికీలోంచి" అంటూ అందుకున్నాను. కూలివాడు గుమ్మం అంటవచ్చి సామాను సర్దడానికి మరి జాగాలేదు. ఆ గాడీకి ఒకే గుమ్మం. ఎంతమంది ఎక్కినా ఆ గుమ్మంఅంటే. ఎంతమంది దిగినా ఆ గుమ్మంఅంటే.

తక్కినవాళ్ళమాట ఎలావున్నా నా మట్టుకు నేను సదు పాయంగా సర్దుకూర్చోగలిగాను ఒక్క సెకనులో. గోదావరి స్టేషన్‌కు బండివెళ్ళే అంతలో బహూ సావకాశంగా ప్లాట్‌ఫారమ్ మీద మిత్రుల్ని పలకరించి "మద్రాస్" వెడుతున్నాను యని చెప్పగలిగేటంత స్థావరత్వం సంపాదించుకున్నాను బల్లమీద.

గోదావరీ ప్లాట్‌ఫారంమీదనుంచి వోమిత్రుడు, ఓబంగారు వన్నెచెట్టు సంపెంగపువ్వు నా మీదకు విసిరాడు. మఱో మిత్రుడు

ఓ దైనిక పత్రిక మీద పారేశాడు. రెండూ అలా అంజలిపట్టి యందుకుంటూ "గుడ్‌బై" అన్నాను. వారున్ను "గుడ్‌బై" అన్నారు.

మెయిల్ మఱి వంతెనమీదను చప్పుడుచేస్తూ నడుస్తూ వుంది. అయితే మెయిలు నడక వంతెనమీద యతి నెమ్మది. ఎప్పుడైనా తెలుసుకున్నారో లేదో పాఠకులు టక్‌టక్ యని రెండు దెబ్బలుకొట్టి కొంతసేపు ఆగి మళ్ళీ "టక్" మంటుంది ధ్వని. బండి సాగుతూనే యుంటుంది. రెండువెంపుల కిటికీల్లోంచి ప్రకృతి దృశ్యం పరవశం పుట్టిస్తూంది. ధ్వని యవుతూనే ఉంటుంది. ప్రయాణీకులు యందరూ పరస్పరం తీయబడి చూపులు చూచుకుంటూ తన్మయులు అవుతారు.

నా ఎదరబల్లమీద ఇద్దరు యువతులు ఇద్దరు యువకులు కూర్చునియున్నారు. బాగా పరిశీలిస్తే ఒక యువకు డొక యువతిని ఒక యువకు డొక యువతినిచేరి కూర్చున్నట్టు కాపడ్డారు. ఇంకా యోజిస్తే వారిద్దరూ ఒక్కొక్క దంపతులు యన్న నిర్ధారణకూడా మనం రావచ్చును. మఱిన్నీ విలోకిస్తే ఒకరు అరవ దంపతులు, ఒకరు తెలుగు దంపతులుగాను బోధ పడక మానదు. నా తీరుబడి చూపులు అప్రయత్నంగా ఆ నలువురుమీదకు ప్రసరింప సాగినాయి.

నా చేతిలోని పువ్వు వో అమ్మాయికి నా చేతిలోని దైనిక పత్రిక ఓ అమ్మాయికి ఊరికేనే హృదయపూర్వకాభినందన సమేతంగా ఇచ్చివేదామని తొల్త ఊహ పోయింది కాని ఎదో వెనుదృష్టిని ఆ పువ్వును ఆ దైనికమీద పెట్టి బులబులాగ్గా మణచి, వారు కూర్చున్న మీతట్టు సామానుపెట్టుకొన్న అటక

చెక్కమీద వారి సామానుతోపాటు జాగ్రత్తగా చూస్తూయుండు మన్నట్టు చొప్పించి ఉంచాను. దైనికలోని వార్తలు వెలికి విన వచ్చినట్టు లేదు కాని, పువ్వుమాత్రం ఘుమఘుమా పరిమళించి వేసింది, నేను నా బల్లమీద పక్కపరుచుకు పడుకుని నిదర పోయే పర్యంతమూను.

అయితే నిదర పడుతుందా? నేనొంటరిగాణ్ణి. ఎదర రెండు జోడాలు కొంతసేపు వారికీ నాకూ ఉన్న యవస్థాభేదం తలపోసికొన్నాను. కొంతసేపు వారూ వారూ యన్యోన్యం దంపతులు మాటాడుకొనే నుడువులూ చూచుకొనే చూపులూ విలాసంగా ఉపలక్షించాను. తుదకో నిశ్చయానికి వచ్చాను. "అరవ యువతి తెనుగు యువతికంటె యందంగా ఉండి తీరుతుంది" అని. మఱిన్నీ "తెగించి ఊ-తెగ కబుర్లు చెప్పి పొద్దు పుచ్చుతుంది" అని. అయితే తెనుగు యువతి అరవ యువతికంటె చేష్టల్లోను చిన్నెల్లోను అందెవేసిన చేయి" అని కూడా గమనించ గల్గాను.

కొంతసేపటికి నిద్రాదేవత "ఎంతసేపు వాళ్ళను పరిశీలిస్తావు? నన్ను చూడు!" అన్నట్టు తన యొక్క యత్యంతమైన యౌవన వికారంతో వచ్చి నా మీద పడింది. లోకాన్నంతనూ మరిచిపోయాను.

మళ్ళీ ఏలా మెలకువ వచ్చిందో నాకే విప్పిచెప్పడానికి బోధపడకుండా వుంది.

తెల్లతెల్లాఱుతూంటే తోడి ప్రయాణీకులు నలుగురూ ఒకేచోట "గూడూరు"లో దిగిపోయి యప్పటికప్పుడే ప్లాట్‌ఫారం మీదికి తమ సామాను అంతా దించివేసికొని దిగిపోయినట్లు

తోస్తుంది. వారి సామానుతోపాటు నా పత్రికా, పుష్పమూకూడా ప్లాట్‌ఫారమ్ మీదకు వెళ్ళిపోయినట్లు యగుపిస్తూంది. తెనుగు దంపతులు వారి సామాను కూలీ నెత్తికెక్కించి చడీచప్పుడూ కాకుండా వెళ్ళిపోతున్నారేమో అరవ దంపతులు ఏదో పరస్పరం రహస్య మాడుకుంటూ వున్నారు.

యువతి : ఏమిటి పారేశారు ?

యువకుడు : నిన్నటి దైనిక - నిన్నటి పువ్వు.

యువతి : అవి ఆయనవండీ! మనవి కావు.

.... .... .... .... ....

# ఇది కుర్చీ కాదు గోడకుర్చీ

ఈ రోజుల్లో ఏ సరుకు ఒక నిమిషం "దొరకదు. లేదు" యని అంటే, దాని లేమి చేతనే లోకం అంతా లేనట్టు. తాను లేనట్టు, కొంప మునిగినట్టు, కొట్టుమిట్టాడిపోవడం రివాజు అయిపోయింది. "పంచదారలే" దనండి—"అమ్మమ్మమ్మా పంచదార చిటికె డుంటే విదుపుదురూ పుణ్యముంటుంది," అని రూపాయికాగితం చేత పుచ్చుకు జెండాలా ఎగరేస్తువుంటాడు ఒకానొక వ్యక్తి.

"కాఫీ పొడుంకు కరువొచ్చింది యని అననియ్యండి,— పదిమంది వెనకాతల మనిషీ గిరాఫీలా మెడెత్తి కాఫీపొడరు షాపులోకి తలదూర్చి "అదిగో! అడుతున్నారే! అబ్బే! అబ్బే! ఆలాపోనియి ఇంటిదగ్గఱ పొయిమీద నీళ్లెట్టు కూర్చున్నారు మావారు.